క్లుప్తంగా

మజ్జిగ కేంద్రం ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎంపీపీ

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలో శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నంద్యాల జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ఎంపీపీ వీరనారాయణరెడ్డి, మఠం ఫిట్‌పర్సన్ సి.శంకర్‌బాలాజి, పూర్వపు మఠాధిపతుల పెద్ద కుమారుడు శ్రీ వెంకటాద్రిస్వామి ప్రారంభించారు. అనంతరం వారు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తహసీల్దార్ ఈశ్వరయ్య, మఠం మేనేజర్ ఎస్.ఈశ్వరయ్య ఆచారి, నంద్యాల చంద్రమౌళి ఆచారి పాల్గొన్నారు.

- జగన్మాత శ్రీ ఈశ్వరీదేవిమఠంలో శ్రీనివాస నిలయం చారిటీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంచార చలివేంద్రాన్ని మఠాధిపతులు శ్రీ వీరశివకుమారస్వామి ప్రారంభించారు.

డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగేలా కృషి

చాపాడు : గత ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన డ్వాక్రా యానిమేటర్ అనుసూయ ద్వారా మోసపోయి నష్టపోయిన డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి భరోసా కల్పించారు. శనివారం విశ్వనాథపురంలో పర్యటించిన ఎమ్మెల్యేను డ్వాక్రా బాధిత మహిళలు కలిసి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్‌ను గ్రామానికి రప్పించి డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. యానిమేటర్ నుంచి స్వాహా చేసిన డబ్బును రికవరీ చేసి బాధితులకు అందజేయాలన్నారు.

నీటి సమస్య పరిష్కారం

మైదుకూరు : మున్సిపాలిటీలోని గడ్డంవారిపల్లెలో నెలకొన్న తాగునీటి సమస్య తీరింది. మైదుకూరు – బద్వేలు రహదారిలో ఎడమవైపు ఉన్న ఇళ్లకు నీటిని అందించే పైపులు హైవే నిర్మాణంలో దెబ్బతిని ఆ ప్రాంతానికి నీరు అందలేదు. ఆ విషయాన్ని ఈనెల ఒకటో తేదీన కౌన్సిలర్ నారు సుధాకర్ ద్వారా గ్రామస్తులు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే మరుసటి రోజే ఆ ప్రాంతానికి కొత్తబోరు వేయించారు. శనివారం మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, కమిషనర్ రంగస్వామి బోరుకు మోటార్ బిగించి గ్రామస్తులకు తాగునీటిని అందించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : మండలంలోని కొట్టాలపల్లె, అక్కలరెడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీఓ లక్ష్మీదేవి తెలిపారు. కొట్టాలపల్లెకు బీసీ–సి అభ్యర్థిని, అక్కలరెడ్డిపల్లెకు ఎస్టీ అభ్యర్థిని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రూ.50వేలు విలువ చేసే వస్తువులు వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరంలోని వికాస్ విహార్ మానసిక దివ్యాంగుల శిక్షణా కేంద్రానికి ఎర్రగుంట్ల ఐసీఎల్ యాజమాన్యం రూ.50వేలు విలువ చేసే వస్తువులను శనివారం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎల్ ప్లాంట్ హెడ్ శ్రీనివాసరావు, హెచ్‌ఆర్ హెడ్ నాగిరెడ్డి,ప్రిన్సిపాల్ ఝాన్సీ,జింకా జయప్రకాష్, ఐసీఎల్ పర్సనల్ ఆఫీసర్ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టాండింగ్ కౌన్సిల్ లీగల్ అడ్వైజర్‌గా సుదర్శన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ లీగల్ అడ్వైజర్‌గా ప్రముఖ న్యాయవాది అద్దంకి సుదర్శన్ నియమితులయ్యారు. మూడేళ్లపాటు ఈయన పదవిలో కొనసాగనున్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి శనివారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. తన ఎన్నికకు సహకరించిన మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, భావన హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ గోపిరెడ్డి రమణయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా పాలిటెక్నిక్ వార్షికోత్సవం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎస్‌ఆర్‌ఐటీ ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి, సీబీఐటీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాలిటెక్నిక్ చదివిన ఎంతో మంది దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారన్నారు.

సింహ వాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం గంగా రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సింహవాహనంపై ఊరేగించారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



విశ్వనాథపురంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

చాపాడు : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని విశ్వనాథపురం, రాజకొట్టాలు గ్రామాలలో శనివారం సర్పంచ్ భూమిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటింటి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తూ ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కులాలు, మతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు మంజూరవుతున్నాయన్నారు. మంచి చేసిన ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తెలిదేల లక్ష్మయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రామోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, ఏఓ మ్యాగీ, ఎంఈఓ రవిశంకర్, పీఆర్ ఏఈ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగమునిరెడ్డి, కుళ్లాయిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, గురుశేఖర్‌రెడ్డి, కర్నాటి నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, బొలెరో బాషా, రామసుబ్బారెడ్డి, ఓబుళరెడ్డి, జయసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథపురం గ్రామంలో..

విశ్వనాథపురం గ్రామంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు సత్వర చర్యలు తీసుకున్నారు. గ్రామంలో రెండో చోట్ల సిమెంట్ రోడ్లు నిర్మించాలని కోరగా వెంటనే నివేదికలు సిద్ధం చేసి రోడ్లు నిర్మాణం చేపట్టాలని అధికారులను సూచించారు. గ్రామ కంఠాల స్థలాలకు పట్టాలు వచ్చే త్వరలోనే ప్రభుత్వం ద్వారా చర్యలు తీసుకుంటానని భారోసా కల్పించారు. గ్రామంలోని బ్రహ్మకుమారీల వినతి మేరకూ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రార్థనలు చేసుకునేందుకు చర్యలు తీసుకున్నారు. దీంతో హర్షించిన బ్రహ్మకుమారీస్‌లు ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. నాడు–నేడు కింద అభివృద్ధి చెందిన ప్రాథమిక పాఠశాలకు వెళ్లి పరిశీలించారు. రాజకొట్టాలు గ్రామంలో విద్యుత్ సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్ కో సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో రామాలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు.

ప్రభుత్వానికి ప్రజల సంపూర్ణ మద్దతు

చాపాడు : నియోజకవర్గంలో 84వేల కుటుంబాలు ఉండగా 71,168 కుటుంబాల సంపూర్ణ మద్దతు ప్రభుత్వానికి ఉందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. విశ్వనాథపురం గ్రామంలోని శనివారం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి 29వ తేది వరకూ మైదుకూరు నియోజవర్గంలోని ఐదు మండలాలు, మున్సిపాలిటీ పరిధిలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటి వరకూ 84.63శాతం కుటుంబాలు మద్దతు తెలిపాయని చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు, నాయకులు, కార్యకర్తలందరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కాలువపల్లెలో మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

గోపవరం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. శనివారం మండలంలోని కాలువపల్లె సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ముందుగా సచివాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలతో ఏ మేరకు కుటుంబానికి లబ్ధి చేకూరిందో బుక్‌లెట్ ద్వారా చదివి వినిపించారు. నాలుగేళ్ల ప్రభుత్వ పాలనపై ప్రజల అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకునేందుకే అన్ని శాఖల అధికారులతో మీ ముందుకు వచ్చామని, మరో ఏడాది పాలనలో మరింత లబ్ధి చేకూరుతుందన్నారు. ఇంత మంచి పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి వచ్చే ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గోపవరం మల్లికార్జునరెడ్డి, సచివాలయ కన్వీనర్ పుల్లయ్య, ఎంపీటీసీ కుప్పాలరాజేశ్వరి, మాజీ సర్పంచ్‌లు శ్రీరాములు, సుబ్బారెడ్డి, ఎంపీడీఓ హరినారాయణ, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలులో గ్యాంగ్‌వార్

- నడిరోడ్డుపై పరస్పరం దాడులు
- ఇరువర్గాలకు చెందిన 16 మందిపై కేసు

బద్వేలు అర్బన్ : పట్టణంలో శుక్రవారం రాత్రి రెండు గ్రూపుల మధ్య జరిగిన గ్యాంగ్‌వార్ కలకలం రేపింది. అర్ధరాత్రి యువకులు నడిరోడ్డుపై వీరంగం సృష్టిస్తూ పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుల మేరకు 16 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే... పట్టణానికి చెందిన హబీబ్, షారూక్ అనే వ్యక్తుల మధ్య ఓ విషయమై రెండు రోజుల క్రితం ఘర్షణ జరిగింది. దీనిని దృష్టిలో ఉంచుకుని షారూక్ రాజంపేట, కడప, బెంగుళూరు, బద్వేలులోని తన అనుచరులను పిలిపించి శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో హబీబ్‌పై కర్రలు, రాళ్లతో దాడులు చేశారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన హబీబ్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరాడు. అయితే విషయం తెలుసుకున్న హబీబ్ అనుచరులు షారూక్ కోసం గాలిస్తుండగా అతడి అనుచరుడైన రాజంపేటకు చెందిన నబీరసూల్, మరికొందరు స్థానిక నెల్లూరు రోడ్డులోని ఓ లాడ్జిలో ఉన్నట్లు తెలుసుకుని అక్కడికి వెళ్లి దాడి చేశారు. ఈ ఘటనలో నబీరసూల్‌తో పాటు మరికొందరు గాయపడ్డారు. పరస్పర ఫిర్యాదుల మేరకు ఒక వర్గానికి చెందిన 10 మందిపై, మరో వర్గానికి చెందిన 6 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

డీఎంహెచ్ఓ నాగరాజు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ నాగరాజు

మైదుకూరు : మాతా శిశు మరణాలను అరికట్టేందుకు అంగన్‌వాడీలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పని చేయాలని డీఎంహెచ్ఓ నాగరాజు, ఐసీడీఎస్ పీడీ రాణి అన్నారు. శనివారం మైదుకూరు మున్సిపాలిటీలోని కృష్ణాపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి కాని, బిడ్డ కాని, గర్భిణులు ఏ సమస్యతోనైనా మరణించకుండా చూడాలని అన్నారు. వారికి అందాల్సిన పౌష్టికాహారం, ప్రభుత్వ పథకాలు కచ్చితంగా అందేలా చూడాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని, ఏఎన్ఎంల రికార్డుల్లో ఉన్న గర్భిణులు, తల్లీ బిడ్డల వివరాలను డీఎంహెచ్ఓ, ఐసీడీఎస్ పీడీ తనిఖీ చేశారు. మాతా శిశు మరణాలను అరికట్టేందుకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి తేజస్విత, వనిపెంట పీహెచ్‌సీ వైద్యాధికారి మల్లేష్, ఎంటమాలజిస్ట్ ఖాజా మొహిద్దీన్, సూపర్‌వైజర్ ప్రసాద్, ఐసీడీఎస్ మైదుకూరు ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి, సూపర్‌వైజర్ వరలక్ష్మి, అంగన్‌వాడీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణుల నివేదిక పక్కాగా నమోదు చేయాలి

చాపాడు : ఐసీడీఎస్ పరిధిలో అంగన్వాడీ కేంద్రాలలో, వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఏఎన్ఎంల వద్ద గర్భిణుల నివేదిక వివరాలు ఒకేలా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నాగరాజు పేర్కొన్నారు. మండలంలోని నక్కలదిన్నెలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గ్రామ సచివాలయంలో వైద్య, అంగన్వాడీ వర్కర్ల వద్ద రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి మాట్లాడుతూ.. అనీమియా ఉన్న వారికి ఐసీడీఎస్ ద్వారా మంచి పౌష్టికాహారం అందివ్వాలన్నారు. ఏఎన్‌సీలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏఎన్ఎంలు, అంగన్వాడీ సిబ్బంది పర్యవేక్షించాలని, వారికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

పశువైద్యంపై సదస్సు

ప్రొద్దుటూరు : స్థానిక పశువైద్య కళాశాలలో శనివారం ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా పశువైద్యంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ వైకుంఠరావు 'సమాజ అభివృద్ధికి పశువైద్యుని పాత్ర' అనే అంశంపై ప్రసంగించారు. ప్రపంచ పశువైద్య సమాఖ్య ఈ సంవత్సరాన్ని 'ప్రమోషన్ ఆఫ్ డైవర్సిటీ, ఈక్విటీ అండ్ ఇన్‌క్ల్యూస్వెన్స్ ఇన్ ది వెటర్నరీ ప్రొఫెషన్' అనే అంశాన్ని నిర్ధారించిందన్నారు. పశువులలో నూతన వ్యాధి నిర్ధారణ పరీక్షలు, నివారణ మార్గాలను వివరించారు. కళాశాల డీఎస్ఏ ప్రొఫెసర్ వినోద్ కుమార్ 'అనియంత్రిత యాంటి బయోటిక్స్ దుష్ప్రభావాలు – వాటి నియంత్రణ చర్యలు' అనే అంశంపై వివరించారు. ఈ సదస్సులో కళాశాల బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జేవీవీ సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోండి

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ పట్టణ కార్యదర్శి కళ్యాణ్ కృష్ణ, జిల్లా ఆరోగ్య విభాగం కన్వీనర్ డాక్టర్ చక్రధర్ తెలిపారు. శనివారం స్థానిక నందినీ క్లాత్ మార్కెట్‌లోని జేవీవీ కార్యాలయంలో సమ్మర్‌క్యాంప్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 30 నుంచి జూన్ 11వ తేదీ వరకు రోజూ ఉదయం 8 నుంచి 10 గంటల వరకు 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జేవీవీ కార్యాలయంలో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ క్యాంప్‌లో డ్రాయింగ్, మ్యాజిక్, సైన్స్ పరిశోధనలు, ఫన్ మ్యాథ్స్, పాటలు–ఆటలు, స్టోరీ టెల్లింగ్, క్యాలిగ్రఫీ, ఒరిగామి, ఫీల్డ్ ట్రిప్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. విద్యార్థులు సెల్‌నంబర్ 9705432038 కు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్, జిల్లా నాయకులు మురళీగుప్త, రవిశంకర్ రెడ్డి, అక్షత, శర్వాణి, మధుసూదన్‌రెడ్డి, కోఆర్డినేటర్స్ అక్షయ, పవన్ సాయి, అజర్ అహ్మద్, మేషక్, భవ్య, హాసిని, బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి పత్రాలు పంపిణీ

చాపాడు : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం వార్షికోత్సవ వేడుకలు, పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపేట ప్రాథమిక పాఠశాలలో హెడ్ టీచర్ జవహర్ మున్సీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ రవిశంకర్ చేతుల మీదుగా విద్యార్థులకు ప్రగతి పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాలైన వసతులు అందుబాటులో ఉన్నాయన్నారు. విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తూ ప్రగతి పత్రాలు అందజేసి పై తరగతులకు అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు. లక్ష్మీపేట సర్పంచ్ శ్రీవిద్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ సుబ్బన్న పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్తు' దేశంలో ఎక్కడా చేయలేదు

- నియోజకవర్గంలో 81,556 ఇళ్లు తిరిగాం
- 62,685 మంది ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్ కాల్ ఇచ్చారు
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



జగనన్నే మా భవిష్యత్తు పుస్తకాలను ఎమ్మెల్యేకు అందిస్తున్న సచివాలయాల ఇన్‌చార్జిలు

ప్రొద్దుటూరు : 'జగనన్నే మా భవిష్యత్తు'లాంటి కార్యక్రమాన్ని దేశంలో ఎక్కడా నిర్వహించలేదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. ఒక పార్టీ అధికారంలో ఉండి నాలుగేళ్లు పూర్తయిన తర్వాత ప్రజల వద్దకు ధైర్యంగా వెళ్లాలని పార్టీ ఆదేశించడం గొప్ప నిర్ణయమని అన్నారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో పూర్తయిన సందర్భంగా శనివారం ఎమ్మెల్యే రాచమల్లు మీడియాతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 91వేల ఇళ్లకుగాను 81,556 ఇళ్లకు పార్టీ శ్రేణులు వెళ్లాయన్నారు. వీటిలో 62,686 కుటుంబాలు ప్రభుత్వానికి మద్దతుగా మిస్డ్ కాల్ ఇచ్చారని, సాంకేతిక సమస్యల కారణంగా 12వేల మిస్డ్ కాల్స్ ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలోని గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఇతర నాయకులు ఐకమత్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు ఎమ్మెల్యే అభినందించారు. గతంలో ప్రభుత్వాలు కేవలం ఎన్నికల సందర్భంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లేవని, ఎన్నికల తర్వాత పట్టించుకునేవారు కాదన్నారు. చెప్పిన పథకాలు చెప్పినట్లుగా చేసి ఇంకా ఏమైనా లోపాలు ఉన్నాయేమోనని తెలుసుకునేందుకు తమను గడపగడపకు ముఖ్యమంత్రి జగన్ పంపారన్నారు.

చంద్రబాబు ఎందుకు తిరగలేకపోయారు

జగన్ ప్రభుత్వంలాగా చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఎందుకు పార్టీ నాయకులు ఇలా ఇంటింటికి తిరగలేకపోయారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. చెప్పినట్లు డ్వాక్రా రుణాలను మాఫీ చేశారా, రైతు రుణాలు మాఫీ చేశారా, బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారును ఇంటికి రప్పించారా, పేదల సొంతింటి కలను నెరవేర్చారా అని నిలదీశారు. సమావేశంలో గ్రామ సచివాలయాల మండల ఇన్‌చార్జి కల్లూరు నాగేంద్రారెడ్డి, పట్టణ సచివాలయ ఇన్‌చార్జిలు పోసా భాస్కర్, కాకర్ల నాగేశ్వరెడ్డి, రాజుపాళెం మండల ఇన్‌చార్జి వెలవలి రాజశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల కన్వీనర్లు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు పుల్లారెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ జగనన్న పాలనే కోరుకుంటున్న ప్రజలు

ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో ప్రజలు మళ్ళీ జగనన్న పాలనే రావాలని కోరుకుంటున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. బద్వేలు మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా ఈనెల 7న ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం స్థానిక నెల్లూరు రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం పేరుతో నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేకు ప్రజల నుండి విశేష స్పందన లభించిందన్నారు. అందులో భాగంగా మున్సిపాలిటీలో 90 శాతం, ఇతర మండలాల్లో 75 శాతం మేర సర్వే పూర్తయిందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 87,667 గృహాలు ఉంటే 78,467 గృహాలకు వెళ్ళి మా నాయకులు ప్రభుత్వం చేసిన మేలును వివరించారన్నారు. విజయవంతం చేసిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారుశీనయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాలక్ష్మీదేవిశ్రీరాములు, మున్సిపల్ వైస్‌చైర్మన్లు గోపాలస్వామి, ఆర్.వి.సాయిక్రిష్ణ, ఆయా మండలాల జేసీఎస్ కన్వీనర్లు యద్దారెడ్డి, మల్లికార్జునరెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌లో నుంచి రూ. 1.39 లక్షలు అపహరణ

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక విజయ్‌కుమార్ సర్కిల్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు రూ. 1.39 లక్షలు దోచుకొని వెళ్లారు. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు బుద్దాయపల్లెకు చెందిన సోమశేఖర్‌రెడ్డి శనివారం గాంధీరోడ్డులోని ఇండియన్ బ్యాంక్‌కు వెళ్లి రూ. 1.39 లక్షలు డ్రా చేశాడు. ఆ డబ్బును బైక్ ముందు భాగాన ఉన్న ట్యాంక్ కవర్‌లో పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు. ఈ క్రమంలో అతను రాజీవ్ సర్కిల్ సమీపంలోకి వెళ్లగానే ఫోన్‌కాల్ వచ్చింది. దీంతో అతను బైక్ ఆపుకొని ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. ఇంతలోనే ఒక వ్యక్తి అతని వద్దకు వచ్చి డబ్బులు కింద పడిపోయాయి చూసుకోండని చెప్పాడు. డబ్బులు నిజంగానే కింద పడిపోయాయేమోనని సోమశేఖర్‌రెడ్డి వెనక్కి తిరిగి చూసుకున్నాడు. పక్కనే ఉన్న ఆ వ్యక్తి ట్యాంక్ కవర్‌లోని డబ్బు తీసుకొని ఉడాయించాడు. ఈ మేరకు అతను త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరాల్లో పరిశీలించిన పోలీసులు అనుమానితులను గుర్తించి వారి ఫోటోలను విడుదల చేశారు. నిందితులను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ నారాయణయాదవ్, ఎస్ఐ కృష్ణంరాజునాయక్‌లు కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నారాయణయాదవ్ తెలిపారు.